# మతాభిమానం

ఒక వైశాఖ పౌర్ణమికి ఆ చిన్న రాజ్యానికి ఒక బౌద్ధ సన్యాసి వచ్చి, బౌద్ధాన్ని మించినది మరో మతం లేదని ఒప్పించాడు. రాజుగారికి అన్నీ నచ్చాయి గాని అహింస నచ్చలేదు. అయిదురకాల మాంసం కూరలు లేకుండా ఎలా ఆరగించటం?

"మీరు జంతు వధ చెయ్యరాదు. వధించిన జంతువులను నిక్షేపంగా తినవచ్చు" అన్నాడు సన్యాసి. రాజు తృప్తిపడ్డాడు. సన్యాసి రాజగురువుగా ఉండిపోయాడు.

బౌద్ధం ప్రజలలో వ్యాప్తి కావటానికి రాజు ఇతర మతాల మీద పన్నులు వేశాడు. అందరూ బౌద్ధం పుచ్చుకున్నారు. కటికవాళ్లు కూడా తాము జంతువధ మానేస్తామనీ, బౌద్ధం పుచ్చుకుంటామనీ అన్నారు.

రాజు ఆందోళన చెంది, బౌద్ధ సన్యాసిని సలహా అడిగాడు. బౌద్ధ సన్యాసి మరింత ఆందోళన చెందాడు – అతగాడికి కుందేలు మాంసం మహా ఇష్టం – గాని తన ఆందోళన బయటపడనీయక, "రాజా, వాళ్లమీద పన్నులు తీసెయ్యి. బోయవాళ్లకూ, కబేలాలవాలక్కాశి రెట్టింపు డబ్బులు ముట్టేటట్టు మాంసాదుల ధరలు పెంచు" అన్నాడు.

రాజు అలాగే చేశాడు. అయినా మాంసం సరఫరా చేసేవారు వందల సంఖ్యలో బౌద్ధం అవలంబించి, గుండ్లు గొరిగించుకుని, అహింస అవలంబించాం అన్నారు.

రాజుకూ, ప్రజలకూ పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్టయింది.

ఇంతలో ఆ దేశానికి శంకరాచార్యుల శిష్యుడు ఒకడు వచ్చి వైదిక ధర్మప్రచారం ప్రారంభించాడు.

"మహారాజా, ఈ వైదికుణ్ని దేశం నుంచి పారదోలండి" అన్నాడు మంత్రి.

బౌద్ధ సన్యాసి గుడ్లు ఎర్రజేసి, "మంత్రీ, తెలిసీ తెలియని సలహా చెప్పకు" అని తన సలహా రాజుకు చెప్పాడు.

తరవాత రాజబంధువొకడు శంకరుల వారి ప్రశిష్యుడై దేశమంతటా యజ్ఞాలు జరగాలని ప్రబోధం చేశాడు. యజ్ఞాలను నిషేధిస్తూ శాసనం జరగలేదుగాని, బలిపశువుల మాంసం రాజుగారిదని శాసనం జరిగింది.

తరవాత రెండేళ్లకు ఆ దేశంలో ఒక్క బౌద్ధుడు లేడు. బోలెడంతమంది బోయవాళ్లూ, బేస్తవాళ్లూ, కటికవాళ్లూ ఉన్నారు.

*ముద్రణ : యువ, జనవరి 1977*